క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



మానవపాడు: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆరోగ్యకేంద్ర సూపర్‌వైజర్ చంద్రన్న సూచించారు. గురువారం మండల కేంద్రంలో పరిసరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రోడ్లపై నీరు నిలువలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం డేస్ మెడికల్ ఆధ్వర్యంలో ఐజోన్ కంటి హాస్పిటల్ వారు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మహ్మద్ యూనీస్ ఓపీ తీసుకున్నవారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇల్యాస్, జనార్దన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ర్యాలీ



గట్టు: హిందూ సంఘాల ఐక్య వేదిక, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో భారతీయ మహిళలు, హిందువులపై జరుగుతున్న దారుణాలు, హత్యలకు నిరసనగా సంత బజారు నుంచి బస్టాండ్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి, బంద్ పాటించారు. కార్యక్రమంలో బీజేపీ గద్వాల కన్వీనర్ రామాంజనేయులు, బీజేపీ నాయకులు మధుసూదన్ రావు, బల్గెర శివారెడ్డి, నల్లారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గూడూరు నాగప్ప, విశ్వహిందూ పరిషత్ మండల కన్వీనర్ తాయప్ప, కార్యదర్శి నాగేష్, తిమ్మప్ప, శ్రీధర్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఉండవెల్లి: బైక్‌పై వేగంగా వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి గాయాలైన ఘటన ఉండవెల్లి జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. ఇటిక్యాలపాడు శివారులో గద్వాల నుంచి కోడుమూరుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి జాతీయ రహదారిపై పడడంతో గాయాలయ్యాయి. రెండు సంఘటనల్లో గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ఉండవెల్లి వైపుగా వస్తున్న ట్రాక్టర్‌ను హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వేగంగా వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. బైక్‌పై కర్నూల్ జిల్లా లొద్దిపల్లెకు చెందిన శ్రావణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్‌పై శ్రీరాములు కాలుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇటిక్యాలపాడు శివారులో గద్వాల్ నుంచి కోడుమూరుకు వెళ్తున్న బైక్ జాతీయ రహదారిపై అదుపు తప్పడంతో సుధాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైవే ఆంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు

ఉండవెల్లి: ఈనెల 26న బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో గురువారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఏఎస్‌ఐ వివరాల ప్రకారం.. మండలంలోని అలంపూర్ చౌరస్తాకు చెందిన రుక్మా మంగల్‌రెడ్డి కుమారుడు జగదీశ్వర్ రెడ్డి ఈనెల 26న కర్నూల్ నుంచి అలంపూర్ చౌరస్తాకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం దూమ్ డాబా సమీపంలో ఢీకొట్టింది. దీంతో జగదీశ్వర్‌రెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. గురువారం తండ్రి మంగల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నత్తనడకన ఆర్డీఎస్ కాల్వ పనులు

మానవపాడు: మండలంలోని కొర్విపాడు స్టేజీ సమీపంలో ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటరీ– 30 కాల్వ గుండా వెళ్లే కాల్వకు మరమ్మతు చేస్తున్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అమరవాయి, గోకులపాడు, చెన్నిపాడు, కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్, మెన్నిపాడు, బొంకూర్ శివారులోని పంటపొలాలకు డీ–30 కాల్వ గుండా తుమ్మిళ్ల నీరు వస్తుంది. మరమ్మతు పనులు సాగుతున్న కారణంగా వ్యవసాయ పనులకు, మందు పిచికారీ చేసేందుకు నీరులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వ పనులు త్వరగా పూర్తి చేసి నీరు పారేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- ముగిసిన 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలు
- ధరూర్, చాగాపురం, అలంపూర్‌లో పోటీల నిర్వహణ
- ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



అలంపూర్‌లో క్రీడా పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు

ధరూరు: 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలు మండలంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించన పోటీలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకుల, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బీఎస్ ఆనంద్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ రాఘవేంద్ర, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, భీసన్న, క్రిష్ణ పాల్గొన్నారు.

ఎర్రవల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి అశోక్‌కుమార్, ఎంపీడీఓ అజాద్ మొహియుద్దీన్‌లు అన్నారు. ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు. ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ హాకీ దిగ్గజం క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఆనంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరి జితేందర్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, పాగుంటన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎంఈఓ అశోక్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. అండర్–14,17 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో టోర్నమెంట్ కమ్ సెలక్షన్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎంఈఓ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు భరత్, శ్రీనివాసులు, శైలజ, పార్వతమ్మ, రాజు, తిరుపతయ్య, పీఈటీలు వెంకటేశ్వర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండల స్థాయి అండర్–14 కబడ్డీ పోటీలు మండలంలోని మేడికొండ జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. మెదటి బహుమతి నవభారత్ హైస్కూల్, 2వ బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ మేడికొండ, 3వ బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ పులికల్, 4వ బహుమతి అక్షర హైస్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు. విజేతలకు ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. కా ర్యక్రమంలో మేడికొండ ఉపాధ్యాయుడు తిమ్మారె డ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్, సోమశేఖర్‌రెడ్డి, చిన్నతిమ్మప్ప, రామనాయుడు ఉన్నారు.



చాగాపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ అశోక్‌కుమార్



ధరూరు ఉన్నత పాఠశాల బాలికలకు మెమొంటోను అందజేస్తున్న ఉపాధ్యాయులు



మేడికొండలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

గద్వాల అర్బన్: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ.2లక్షల మాఫీ చేయాలన్నారు. రైతు భరోసా అమలుపై స్పష్టంగా విధివిధానాల ప్రకటించాలని, నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ, రామకృష్ణ, వీరేష్, అశోక్, మల్లేష్ ఉన్నారు.

రాజోళి: అర్హులైన రైతుందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు గోపాల్ రెడ్డి, సీపీఎం నాయకులు విజయ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, లక్ష్మన్న, సోల్ రాజు, రామకృష్ణారెడ్డి, ఖాజన్న, సుందర్ రాజు పాల్గొన్నారు.

ధరూరు: రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ మాట్లాడారు. కార్యక్రమంలో మేకల నర్సింహులు, తిమ్మప్ప, పరశురాం, గోవిందు, ప్రవీణ్ పాల్గొన్నారు.



గద్వాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గట్టు: రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు వీవీ నర్సింహ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. **మల్దకల్:** రైతులకు ప్రభుత్వం షరతులు లేకుండా రుణాలు మాఫీ చేయాలని సీపీఎం జిల్లా నాయకు డు వీవీ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సవార న్న, తిమ్మప్ప పాల్గొన్నారు.



గట్టులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలి



గట్టులో మాట్లాడుతున్న రామాంజనేయులు

గట్టు: బీజేపీ సభ్యత్వ నమోదుపై గురువారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ గద్వాల కన్వీనర్ రామాంజనేయులు మాట్లాడుతూ గట్టు మండలంలో అత్యధికంగా బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలని, దీనికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. సభ్యత్వ నమోదు మండల కన్వీనర్‌గా బల్గెర నల్లారెడ్డి, కో కన్వీనర్‌గా నాగప్ప, మహిళా కన్వీనర్‌గా జీ.సంధ్యలను నియమించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూడూరు నాగప్ప, నాయకులు మధుసూదన్‌రావు, బల్గెర శివారెడ్డి, మోహన్‌చంద్ర, మాచర్ల సురేష్, సంజీవనాయుడు, వీరశేఖర్‌గౌడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు



మాట్లాడుతున్న గట్టన్న

అలంపూర్ రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు ఏమేలమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మిక సంఘం అధ్యక్షుడు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న మాట్లాడారు. కార్మికులు ప్రజల కోసం పారిశుద్ధ్య సేవలు అందించడంలో ముందుంటారని, వారి సమస్యలు మాత్రం ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న కార్మిలందరిని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న డిమాండ్ చేశారు. అలంపూర్ మండల కేంద్రంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా లక్ష్మన్న, ఏసేపు, ప్రధాన కార్యదర్శిగా హుస్సేన్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

గద్వాలటౌన్: పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ కలందర్ బాషా, పలవురు తెలుగుభాష కోవిదులు పాల్గొని తెలుగు భాషా వికాసానికి తోడ్పడతామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు భాషలో విద్యాబోధన జరగాలని కోరారు. మాతృభాషలో విద్యాబోధన జరిగినప్పుడే విద్యా ప్రమాణాలు మెరుగు పడుతాయన్నారు. స్థానిక ప్రగతి విద్యానికేతన్, నోబుల్ హైస్కూల్, తదితర పాఠశాలలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

అయిజ: పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



మల్దకల్: మండలంలోని తాటికుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. రైతులు లో ఓల్టేజీతో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉన్న 5ఎంవీఏకు అదనంగా 3.15ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అదనంగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ శేషగిరిరావు, ఏడీఏ గోవిందు, విద్యుత్ సిబ్బంది పురుషోత్తం, వెంకట్రాములు, దర్శెల్లి, తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించాలి

అలంపూర్ రూరల్: మండలంధిలోని గ్రామాల్లో గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్‌ఐ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఆదేశానుసారం గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా అను మతి తీసుకోవాలని పేర్కొన్నారు. మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతి జారీ చేస్తారని తెలిపారు. మండపాల వద్ద డీజే ఏర్పాటు చేయకూడదని పేర్కొన్నారు.

రైతుల వివరాలు నమోదు చేయించుకోండి

అయిజ: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి సంబంధించి రైతులకు రూ.2లక్షల వరకు రుణాలు ఉన్నవారు, రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ తెలిపారు. గురువారం మండలంలోని ఎక్లాస్‌పురం, దేవబండ, బింగుదొడ్డి గ్రామాల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడారు. రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగని రైతులకు సంబంధించిన వివరాలు గ్రామాల వారీగా నమోదు చేయడానికి మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులు పర్యటిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారులు పర్యటన చేస్తారని తెలిపారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ జరుగని రైతులు మండలంలో మొత్తం 943 మంది ఉన్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, రైతు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు.



రైతుల వివరాలు సేకరిస్తున్న మండల వ్యవసాయ అధికారి జనార్దన్

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం గణపతి పూజ, పుణ్యావాచకం, గోపూజ, మాతృకపూజ, కంకణధారణ, దీక్షాధారణ, యాగశాల, మండపారాధన, జలాదివారం, అగ్నిప్రతిష్ఠ, తీర్థప్రసాదవితరణ నిర్వహించారు. మధ్యాహ్నం శిఖరంను ఆలయం చుట్టూ ఊరేగించారు. సాయంత్రం మంగళహారతి, తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

గద్వాల రూరల్: విద్యార్థినులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ లక్ష్యాలపై దృష్టి సారించాలని భరోసా కేంద్రం కో–ఆర్డినేటర్ శివాని అన్నారు. గురువారం మండలంలో గోన్‌పాడులోని కేజీబీవీలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్య ప్రాముఖ్యత, మహిళల హక్కులు, సాధికారత, మొబైల్ వినియోగం, దుర్వినియోగం, పోక్సో కేసుల నమోదు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలను వివరించారు. విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైన వెంటనే డయల్–100 లేదా భరోసా కేంద్రం 63039 23257కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, భరోసా కేంద్రం సిబ్బంది కీర్తి, విద్యార్థినులు, తదితరులు ఉన్నారు.



భరోసా కేంద్రం అందిస్తున్న సేవలపై కరపత్రాలు విడుదల చేస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు



పశువులకు టీకా వేస్తున్న పశువైద్యురాలు

మల్దకల్: పశువులకు సీజనల్ వ్యాధులు సోకి ప్రమాదాలకు గురి కాకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండలంలోని అమరవాయిలో పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల కాపరులు తమ గొర్రెలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులను ఏడాదికి మూడుసార్లు వేయించుకోవాలని పేర్కొన్నారు. మండల పశువైద్యాధికారి ఉషా, వెంకటరాజు, సిబ్బంది రాముడు, మధు, ఆంజనేయులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అయిజలో చెట్ల కొమ్మలు తొలగింపు

అయిజ: విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకుతుండడంతో గురువారం విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ సిబ్బంది కొత్త బస్టాండ్ నుంచి పెట్రోల్ బంక్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు నరికేశారు. ఈ సందర్భంగా ఏఈ నరేందర్ రెడ్డి మాట్లాడారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన, విద్యుత్ తీగల కింద చెట్లను పెంచడంతో అవి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. హెచ్‌టీ లైన్‌తోపాటు ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలను చెట్ల కొమ్మలు తాకడంతో ప్రతి సంవత్సరం చెట్ల కొమ్మలు నరికేయాల్సి వస్తోందన్నారు. మొక్కలు నాటే సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు పక్కన, విద్యుత్ తీగల కింద మొక్కలు నాటవద్దని కోరారు.



చెట్ల కొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

అఖిలపక్ష నాయకుల పాఠశాల పరిశీలన

అయిజ: పట్టణంలోని దుర్గానగర్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అఖిలపక్ష నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలోని పలు సమస్యలను ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయుడు రవి వారికి వివరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అఖిలపక్ష నాయకులకు వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అఖిపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బాలల సంరక్షణపై అవగాహన

ఎర్రవల్లి: మండలంలోని ఆర్ గార్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై బాలలకు ఎదురయ్యే సమస్యలు, బడిబయటి పిల్లలు, బాల్య వివాహాల వల్లే కలిగే అనార్థాలు, బాల కార్మిక వ్యవస్థతో పాటు బాలల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలలపై ఎలాంటి వేధింపులకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు ఏ సమయంలోనైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1098కి కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అనాథ పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, ఉపాధ్యాయులు నాగకార్తీక్, గురుమూర్తి, విద్యార్థులు ఉన్నారు.



ఆర్. గార్లపాడులో బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ అధికారి శివ

వ్యవసాయ అధికారుల ఇంటింటి సర్వే

శాంతినగర్: రెండు లక్షలలోపు రుణం ఉండి రుణమాఫీకి నోచుకోని రైతుల వివరాలు సేకరించేందుకు వ్యవసాయశాఖ అధికారులు గురువారం తనగలలో ఇంటింటి సర్వే చేపట్టారు. మండల వ్యవసాయశాఖ అధికారి రాధ ఆధ్వర్యంలో ముందుగా గ్రామంలోని రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేసి రెండు లక్షలలోపు రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలు ఇంటింటికి వెళ్లి నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న రైతులందరికి రుణమాఫీ అవుతుందని ఏఓ పేర్కొన్నారు.



తనగలలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఏఓ రాధ, సిబ్బంది